క్లుప్తంగా

సంఘాలు అభివృద్ధి సాధించాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని ఏపీఎం మధుబాబు సూచించారు. శనివారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల వీఏవోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతి నెలా 10వ తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులో అలసత్వం వహించకూడదన్నారు. సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయండి

చీరాల టౌన్: గ్రామాల్లో ఉన్న పంట పొలాలకు సంబంధించిన నీటి తీరువా వసూళ్లను నెలాఖరు కల్లా పూర్తి చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను కూడా పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. శనివారం గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. నీటి తీరువా రూ.46 లక్షలు వసూళ్ల లక్ష్యంగా పని చేయాలన్నారు. రైతుల నుంచి విధిగా నీటి తీరువాను వీఆర్వోలు సక్రమంగా వసూళ్లు చేసి నగదును బ్యాంకులో జమ చేయాలని కోరారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

4న నాయీ బ్రాహ్మణ వివాహ వేదిక

చీరాల: ఒంగోలులోని పద్మావతి ఫంక్షన్ హాలులో మే 4న జరిగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక, సంక్షేమ సంఘం వారిచే నిర్వహించే 5వ ఉచిత వివాహ పరిచయ వేదికను వినియోగించుకోవాలని డాక్టర్ జి.సుబ్బారావు, తాడివలస దేవరాజు శనివారం తెలిపారు. చీరాలలోని హైమా హాస్పిటల్ ఆవరణలో ఉచిత వివాహ వేదిక కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఉచిత వివాహ వేదిక కన్వీనర్ నాదెండ్ల రాఘవ, పోతకమూరి మధుబాబు, మార్కాపురం వెంకటరామారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం



ఇందిరా కాలనీలో పేరుకుపోయిన చెత్త

పర్చూరు(చినగంజాం): మండల కేంద్రం పర్చూరు ఇందిరా కాలనీలో పారిశుద్ధ్య సమస్య కాలనీ వాసులను తీవ్రంగా వేధిస్తోంది. కాలనీలో చెత్త, మురుగు నీరు పేరుకు పోవడంతో కాలనీ వాసులు తమ సమస్యను తీర్చేవారు లేకపోవడంతో సతమతమవుతున్నారు. గడచిన వారం రోజులుగా కాలనీలో తీవ్రంగా పేరుకు పోయిన చెత్తను పంచాయతీ వారు పట్టించుకునే పరిస్థితి కన్పించలేదు. ముఖ్యంగా మసీదు వద్ద చెత్త తీవ్రంగా పేరుకు పోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరా కాలనీలో అన్ని ప్రాంతాల్లో ఇదే విధంగా దారుణమైన పరిస్థితి కొనసాగుతోంది. దాంతో స్థానికంగా నివాసముండే కాలనీ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను సకాలంలో తొలగించక పోవడంతో ఈగలు, దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్ల వెంట చెత్త పేరుకు పోవడమే కాకుండా డ్రైనేజీలో మురుగు నీరు కూడా పేరుకు పోవడంతో ఈ విధమైన దుస్థితి తలెత్తిందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

నేడు పోలేరమ్మ తిరునాళ్లు

చీరాల రూరల్: స్థానిక పట్టణంలోని పాపరాజు తోటలో స్వయంభుగా వెలసిన శచీరాల పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. నెల్లూరు, పల్నాడు, తెలంగాణా రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

రైతు ఇంట పగాకు

- పడిపోయిన నల్ల బర్లీ ధరలు
- నియోజకవర్గంలో 500 ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.1 లక్ష నష్టం
- గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల డిమాండ్



నల్లబబర్లీ గుచ్చుతున్న కూలీలు

అద్దంకి: లాభాలు వస్తాయని ఆశించి సాగు చేసిన నల్ల బర్లీ రైతులను నట్టేట ముంచింది. అటు ఆశించిన ధర లేకపోగా, మరో వైపు దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఎకరాకు లక్షకు పైగా నష్టం రావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. గత సంవత్సరం ధర బాగుండటంతో ఈ సంవత్సరం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 500 ఎకరాలకు పైగా నల్ల బర్లీ పంట సాగు చేశారు. ఎకరాకు రూ.25వేలు కౌలుకు తీసుకుని నల్ల బర్లీ వేశారు. నారు, నాటు, నీటి కట్టుడు, ఎరువులు, పురుగుమందులు, కొట్టుడు, గుచ్చుడు కలుపుకుని ఎకరాకు రూ.2 లక్షలు, కౌలు మరో రూ.25 వేలు కలుపుకుని రూ.2.25లక్షలు పెట్టుబడి పెట్టారు.

తగ్గిన దిగుబడులు..

గత సంవత్సరం ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడులు రాగా, ఈ సంవత్సరం ఏడు ఎనిమిది క్వింటాళ్లు అయ్యే సరికి గగనం అయిందని రైతులు వాపోతున్నారు. దానికి తోడు పెరిగిన కూలీ ధరలతో రైతుకు అధిక పెట్టుబడి అయింది.

అమాంతం తగ్గిన ధరలు

గత సంవత్సరం వైట్ బర్లీ, నల్ల బర్లీ ఒకే ధర పలికింది. రూ. 10 నుంచి రూ.12 వేల వరకు కొనుగోళ్లు జరిగాయి. కానీ ఈ సంవత్సరం అమాంతం తగ్గి రూ.7 నుంచి రూ.8 వేలు మాత్రమే ఉంది. అదీ కొనుగోలు చేసే దిక్కు లేక రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటి వరకు ఒక్క క్వింటా పొగాకు కొనుగోలు చేయలేదని రైతులు చెబుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించి నల్ల బర్లీని కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

నాలుగు ఎకరాలు సాగు చేశా



గత సంవత్సరం ధర బాగుండటంతో నాలుగు ఎకరాల్లో నల్లబర్లీ సాగు చేశా. దిగుబడులు తగ్గాయి. అధికారులు చూస్తే వైట్ బర్లీని కొనుగోలు చేసి.. నల్ల బర్లీని కొనుగోలు చేయడం లేదు. నాకు ఐదు లక్షలకు పైగా నష్టం వచ్చింది.

– బ్రహ్మయ్య, ధర్మవరం

ధర అమాంతం తగ్గింది



నేను ఆరు ఎకరాల్లో నల్ల బర్లీ సాగు చేశా. నాకు నాలుగు లక్షలు నష్టం వచ్చింది. పండించిన పొగాకు ఒక్కాకు కూడా కొనుగోలు చేయలేదు. అటు దిగుబడి తగ్గిపోయింది. ఇటు ధర తగ్గింది. రైతు నానా ఇబ్బందులు పడుతున్నాడు. ఏం చేయాలో దిక్కు తోచడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే రైతుల కుటుంబాలు నట్టేట మునిగినట్లే.

– బాసు, ధర్మవరం

జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష

పర్చూరు(చినగంజాం): పర్చూరు కోర్టులో మే నెల 10 వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జూనియర్ సివిల్ జడ్జి పి. శాంతి పోలీస్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసులు చొరవ చూపాలని సూచించారు. అర్జీదారులు , కక్షిదారులతో చర్చలు జరిపి రాజీ మార్గంలో కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పర్చూరు ఎస్ఐ మాల్యాద్రి, పర్చూరు ఎక్సైజ్ ఎస్ఐ, కారంచేడు ఇంకొల్లు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జడ్జి శాంతి

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో దుష్ప్రభావం

పర్చూరు(చినగంజాం): నిత్యం ఉపయోగించే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు మన ఆరోగ్యంపై దుష్ప్రభావాన్ని చూపుతాయని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యుడు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉప్పుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ వస్తువులను ఏ విధంగా దూరంగా ఉంచాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బ్యాటరీలతో పని చేసే కంప్యూటర్, టీవీ రిమోట్, సెల్ ఫోన్ తదితర నిరుపయోగ వస్తువులపై ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు. అవి చెడిపోయిన తరువాత వాటిని చెత్త కుండీలో పడవేయకుండా ఇ- వేస్ట్ డిస్పోస్ యూనిట్‌లో లేదా పంచాయతీలో అందజేయాలన్నారు. అలా చేయడం వలన వాతావరణ కాలుష్యం తగ్గి వ్యర్థాల నుంచి వచ్చే శ్వాసకోశ, కిడ్నీ, ఎముకల వ్యాధులు కూడా తగ్గుతాయన్నారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో కూడా శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి సిబ్బందికి ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పంచాయతీ ఉద్యోగులు, వీఆర్వోలు యార్లగడ్డ శ్రీనివాసరావు, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు దాసరి చంద్రశేఖర్

సేంద్రియ వ్యవసాయం మిన్న

చినగంజాం: రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు నిర్వహించాలని మండల వ్యవసాయాధికారి కె. భాస్కరరావు అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగుపై సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయాన్ని రైతు సాధికార సంస్థ, సెర్ఫ్ ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. పెదగంజాంకు చెందిన ఎం. యలమందారెడ్డి, చినగంజాంకు చెందిన మేడికొండ ఐజాక్‌లు సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు, ధాన్యం సాగు చేయడంతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్క గ్రామ సంఘం పరిధిలో సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు నిర్వహించాలని నిర్ణయించారు. సబ్సిడీలను గ్రామ సంఘ స్థాయిలో లబ్ధిదారులను గుర్తించాలని తెలియజేశారు. గ్రామ సంఘం పరిధిలో రైతులందరూ సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఎం సుబ్బారావు తెలిపారు. ఎంటీ భారతి, సీసీలు స్వామి, శ్రీలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.



రైతులను సన్మానిస్తున్న అధికారులు

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రేపు నిరసన

చినగంజాం: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ నియోజకవర్గంలోని ఇంకొల్లులో సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన మిర్చి, పొగాకు, మినుము, శనగలు, మొక్కజొన్న, వరి తదితర పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్‌లతో వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇంకొల్లు స్తూపం సెంటర్ నుంచి ఉదయం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్ళి వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రైతుల హక్కుల కోసం సంఘీభావం తెలియజేయాలని కోరారు.

నేడు సమాధుల వద్ద పూజలు



సమాధులకు పెయింటింగ్ చేయిస్తున్న యువకులు

చీరాల రూరల్: చీరాలలోని క్రిస్టియన్ శ్మశాన వాటికలు ఆదివారం జరిగే ఈస్టర్ పండుగకు ముస్తాబవుతున్నాయి. సమాధులను ఆయా రక్త సంబంధీకులు రంగురంగుల పెయింటింగులు, రకరకాల పూలతో అలంకరిస్తున్నారు. పట్టణంలోని విఠల్‌నగర్, జయంతిపేట, మరియమ్మపేట, ఐక్యనగర్, విజయనగర్ కాలనీ, పేరాల గాంధీనగర్, శృంగారపేట, హారిస్‌పేట, ఉడ్‌నగర్, బేర్‌పేట, సాల్మన్ సెంటర్‌లో క్రిస్టియన్ శ్మశాన వాటికలున్నాయి. రెండు రోజులుగా సమాధులను శుభ్రం చేస్తున్నారు. పగిలిన సమాధులకు సిమెంట్ పూయటం, మార్బుల్స్, గ్రానైట్ వంటివాటితో అలంకరిస్తున్నారు. యేసు క్రీస్తు శుక్రవారం రోజున (గుడ్‌ఫ్రైడే) శిలువ మరణం పొందారు. ఆయన తిరిగి మూడో రోజు అనగా ఆదివారం రోజున సజీవునిగా లేస్తాడని క్రైస్తవులు ఎంతో భక్తి విశ్వాసాలతో విశ్వసిస్తారు. మృతి చెందిన తమ పితరులు కూడా సజీవులుగా లేస్తారని క్రైస్తవులు భావించి సమాధులను ఎంతో సుందరంగా అలంకరిస్తారు.

రసాయనాలతో పండ్లు మాగబెడితే చర్యలు



చీరాల మార్కెట్‌లో మామిడి పండ్లు తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ కుమార్, హెచ్‌ఓ జానమ్మ



సాక్షి

ఫలరాజుకు కల్తీ జబ్బు

ప్రచురించిన కథనం

సాక్షి ఎఫెక్ట్..

వేటపాలెం: మామిడి పండ్లను రసాయనాలతో మాగబెడితే చర్యలు తీసుకుంటామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పి. ప్రణీత్ కుమార్ హెచ్చరించారు. మామిడి పండ్లను రసాయనాలతో మాగబెట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నారంటూ సాక్షి దినపత్రికలో 'ఫలరాజుకు కల్తీ జబ్బు' అనే కథనం శనివారం ప్రచురించారు. ఈ కథనానికి స్పందించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి పి. జానమ్మ చీరాల ఫ్రూట్ మార్కెట్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. రసాయనాలతో మాగబెట్టిన పండ్లు కొనవద్దని సూచించారు. రసాయనాలతో పండించిన పండ్ల వ్యాపారులపై కేసుల నమోదు చేస్తామని హెచ్చరించారు.

తల్లీబిడ్డల ఆరోగ్యం ముఖ్యం

బల్లికురవ: తల్లిబిడ్డ ఆరోగ్య సంరక్షణకు పోషణ పక్వాడా వెయ్యిరోజుల కార్యక్రమాన్ని గర్భిణులు సద్వియోగ పరుచుకోవాలని తహసీల్దార్ రవినాయక్ కోరారు. పౌష్టికాహార పక్షత్సవాల్లో భాగంగా శనివారం బల్లికురవలో గర్భిణులకు పౌష్టికాహార కిట్‌లు అందించి సీమంతాలు చేశారు. సూపర్‌వైజర్లు సలోమి, విజయనిర్మల, మీరాబీ, డిప్యూటీ ఎంపీడీఓ దాసరి సుమతి తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ప్రయాణికులకు ప్రజలకు వేసవితాపాన్ని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసి.. ఎంపీపీ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ కుసుమకుమారి, డిప్యూటీ ఎంపీడీవో సుమతి, తహసీల్దార్ పందిరి అంజిబాబు స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ఆనందం

అద్దంకి: ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించడమే లక్ష్యంగా టీటీడీ కార్యక్రమాలను నిర్వహిస్తోందని దాస సాహిత్య ప్రాజెక్టు కో ఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని కొంగపాడు గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు కో ఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ, మాదాల దానయ్య, బ్రహ్మానందనం, అల్లంనేని కాశియ్య పాల్గొన్నారు.

ఘనంగా రోటరీ వ్యవస్థాపకుని జయంతి

అద్దంకి: రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు పాల్‌హారీస్ జయంతిని రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ 1905 అమెరికాలో పాల్ నలుగురు సభ్యులతో రోటరీ క్లబ్‌ను ఏర్పాటు చేశారని వివరించారు. రోటరీ అధ్యక్షుడు వీరయ్య, ఎండీ రఫీ, చిన్ని మురళీ కృష్ణ, దేవపాలన, మన్నం త్రిమూర్తులు, తాళ్లూరి బాబూరావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎంపిక

ఇంకొల్లు(చినగంజాం): ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఇంకొల్లు మండల శాఖ అధ్యక్షులుగా కరి కమలేశ్వరరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం ఇంకొల్లులో నిర్వహించిన ఎన్నికల్లో మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా తగిరశ వీరాంజనేయులు, కోశాధికారిగా భవనం హరే రామిరెడ్డి, కార్యవర్గ సభ్యులు మొత్తం 13 మంది ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టి. కృష్ణయ్య తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా ఎన్. నాగేశ్వరరావు, జిల్లా పరిశీలకులుగా షేక్ కమాలుద్దీన్ వ్యవహరించారు. బాపట్ల జిల్లా శాఖ 2 అధ్యక్షుడు రావుల బాపయ్య చౌదరి, మార్టూరు శాఖ అధ్యక్షుడు కొరిటాల రామారావు, ఇంకొల్లు శాఖ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి

చీరాల రూరల్: స్వాతంత్ర్య సమరయోధులు, బడుగు బలహీన వర్గాల నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న 19వ వర్ధంతిని శనివారం బీసీ సంఘాలు, గౌడ సంఘాలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి నాయకులు పూల మాలలువేసి నివాళులర్పించారు. నాశన రామకోటేశ్వరరావు, బీసీ సంఘ నాయకులు ఎనుమల యానాదిరావు, కర్పూరపు రమేష్, బాల నరసింహారావు, వీరాస్వామి పాల్గొన్నారు.

ఆర్డినెన్స్‌పై హర్షం

చీరాల రూరల్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఆమోదిస్తున్న ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేయడంపై ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్గీకరణకు పాటుపడిన పద్మశ్రీ మందా కృష్ణ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేకు కట్‌చేసి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. బి. లక్ష్మీ నరసయ్య, వి. రమేష్, డి. వందనం, జి. రమేష్, ఎ. రత్నబాబు, కె. అగస్టిన్, వి. కోటేశ్వరరావు, డి. సైమన్, టి. అశోక్, పి. అభిషేక్, టి. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చర్యలు

అద్దంకి రూరల్: వేసవిలో జిల్లాలో విద్యుత్ కోతలు లేకుండా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు బాపట్ల జిల్లా ఎస్ఈ జి. ఆంజనేయులు అన్నారు. శనివారం స్థానిక విద్యుత్ భవన్‌లో శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ స్కూర్ ఘర్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. రైతులకు పగటిపూట 9 గంటలు విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ. 2.62 కోట్లు బకాయిలున్నట్లు తెలిపారు. ఈఈ మస్తాన్‌రావు, శాధికారులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే చేర్పించండి

చినగంజాం: బడి ఈడు పిల్లలందరినీ సర్కారు బడుల్లోనే తల్లిదండ్రులు చేర్పించాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని రామచంద్రనగర్ ప్రాథమిక పాఠశాల పరిధిలోని గ్రామాల్లో ఉపాధ్యాయ బృందంతో కలిసి పర్యటించారు. ఎంఈఓ ఎన్. కోటేశ్వరరావు, హెచ్‌ఎం గుత్తి శారద, ఉపాధ్యాయులు వై. రామాంజనేయులు, నాయబ్ రసూల్, సీఆర్పీ సురేంద్ర, యాజమాన్య కమిటీ ర్మన్ మస్తాన్‌రావు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



అద్దంకి: స్టేషన్ ఆవరణలో సీఐ ఆధ్వర్యంలో..



కారంచేడులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

కారంచేడు: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టితో నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కె. నేతాజీ, తహసీల్దార్ జి. నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రమైనలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, మండలంలోని స్వర్ణ గ్రామంలో తహసీల్దారు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందితో ప్రతిజ్ఞలు చేయించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతల అలవర్చుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు మోటాని మధుసూదనరావు, బాలిగ శివపార్వతి ప్రతిజ్ఞ చేయించారు.



పర్చూరులో అవగాహన ర్యాలీ

అద్దంకి: పట్టణంలోని పోలీస్ కార్యాలయంలో సీఐ సుబ్బరాజు, ఎస్సైలు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆవరణలో మొక్కలు పీకివేసి శుభ్రం చేశారు. అదే విధంగా శింగరకొండ సచివాలయం పరిధిలో ఇ-వేస్ట్ గురించి ఎంపీడీఓ శింగయ్య ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇ- వేస్ట్ అంటే ఎలక్ట్రానిక్ చెత్త అని చెప్పారు. వాడి పారేసిన ఎలక్ట్రానిక్ వస్తువుల వలన ఉత్పన్నమౌతోందన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ అన్నారు. శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించి వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. విషజ్వరాలు ప్రబలకుండా మురుగునీటి గుంటలను పూడ్చి వేయించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి పంపిణీ చేసిన డస్ట్ బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వచేసి కార్మికులకు అందించాలన్నారు.

బల్లికురవ: స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి కోరారు. శనివారం బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో ర్యాలీ మానవ హారం చేపట్టారు. పాత మల్లాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎస్. ప్రభాకరరావు, ఉపాధ్యాయులు సచివాలయ సిబ్బంది చేపట్టారు.

పర్చూరు(చినగంజాం): ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన పర్చూరులో అవగాహన కల్పించారు. సర్పంచ్ మల్లా అంజమ్మ,కార్యదర్శి మస్తాన్‌రావు, ఏపీఎం రామకృష్ణ, ఏపీఓ రమేష్ పాల్గొన్నారు.

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ



మాక్ డ్రిల్‌తో వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చీరాల అర్బన్: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సరైన జాగ్రత్తలు పాటించడం వలన నివారించవచ్చని జిల్లా అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి రామకృష్ణ అన్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని వెంటనే నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం ఎల్‌బీఎస్‌నగర్‌లోని శ్రీ గోరంట్ల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని సిబ్బందికి ప్రయోగాత్మకంగా సూచనలు చేశారు. అగ్ని సురక్షిత భారత దేశానికి ఐక్యమవ్వండి అనే నినాదంతో వివిధ రకాల అగ్ని ప్రమాదాలు, విపత్తుల గురించి వాటి నివారణ చర్యలు గురించి వివరించారు. ఇళ్ళలో గ్యాస్ సిలిండర్‌ల లీకేజీ కారణంగా మంటలు వ్యాపిస్తుంటాయని, అటువంటి సందర్భాల్లో గ్యాస్ సిలిండర్‌ను ఆపివేయడాన్ని వివరించారు.

అద్దంకి రూరల్: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ జి. వెంకట్రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో అగ్ని ప్రమాద నివారణ చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ ఇంటిలో గ్యాస్ లీక్ అయినప్పుడు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు భయాందోళనకు గురి కాకుండా మంటలు ఆర్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.